# ఫ్యూచర్

'ఒక్క ఐదు రూపాయలున్నా ఇద్దువూ?' స్టీవెన్ స్పీల్‌బర్గ్ బ్రతిమ లాడుతూ నన్ను అడిగేడు. 'నా దగ్గరా లేవే' అన్నాను జేబులు తడుముకుంటూ. 'ప్లీజ్' అంటూ నన్ను ప్లీజ్ చేసేలా ముఖం పెట్టాడు. జేబులన్నీ తడుముకొని వున్న ఐదు రూపాయలూ ఇచ్చాను. 'వేగరం సర్దేయాలి సుమా?' అనబోయానో... అన్నానో...

"నేనదే చెప్పేది, వేగరం పక్కలు సర్దేసుకుంటే బాగుంటుంది, బద్ధకమూ వదులుతుంది... లే... టైమవుతోంది. బస్సు తప్పిపోతాం..." అంటూ లేపాడు మిత్రుడు మధు. కళ్ళు తెరిచేసరికి స్టీవెన్ స్పీల్ బర్గ్ లేడు. ఐదు రూపాయల అప్పు ఇవ్వడమూ లేదు. నా లుంగీకి జేబులూ లేవు!

నవ్వుకున్నాను. ఆనందపడ్డాను. ఆశ్చర్యపడ్డాను. జీవితంలో స్టీవెన్ స్పీల్ బర్గ్‌కి నా దగ్గర ఐదు రూపాయలు తీసుకొనే అవసరమొస్తుందో రాదో గాని, నేనాయనకు ఐదు రూపాయలు అప్పిచ్చే స్థితికి 'ఫ్యూచర్' లో చేరుకోగలనో లేదోగాని...

"ఏమిట్రా ముఖం అంత వెలిగి పోతోంది?' మధు అడిగేడు.

ఆశ్చర్యానందాల్ని అణచుకోలేక కలని చెప్పేను.

వాడు నవ్వలేదు. పైగా తీక్షణంగా చూసాడు. ఆపైన 'నీకు గొప్ప ఫ్యూచర్‌ని గురించిన ఆలోచన వుంద'ని తేల్చేసాడు. "లేకపోతే అవార్డు.... అస్కారు అవార్డు విన్నర్‌ను... ఆంధ్రా అవార్డ విన్నర్‌తో పోల్చి ఫ్యూచర్‌ని తలచుకోవడంవల్లే నీకీ కల వచ్చింది తప్పితే వేరే యేం కాదు. అయినా 'షిండ్లర్స్ లిస్టు', 'జురాసిక్ పార్క్'లతో స్పీల్‌బర్గ్ భవిష్యత్తు తేలిపోయింది. నీ భవిష్యత్తే...?!" అని ఫ్యూచర్‌ని గుర్తు చేసాడు.

ఎందుకో ఒక్కసారి నిస్పత్తువ అవరించింది. అలాగే కూర్చోబోయాను. మధు నాకా అవకాశ మివ్వలేదు. బస్సు తప్పిపోతే ఫ్యూచర్‌లో మళ్ళీ బస్సు దొరుకుతుందో లేదో అన్నట్టుగా మాట్లాడేడు.

ఫ్యూచర్ కంటే వాడికి భయపడే తొందరగానే బయలుదేరాను. రూమ్‌కు తాళం పెట్టి రోడ్డున పడ్డాం.

‘ మీ విజయనగరమే కాదు, ఓల్ ఇండియా ఇరుకైపోయింది. చూడ్రా. నేగతసారి వచ్చినప్పటికి ఇన్ని షాపులు లేవు. ఇన్ని కాంప్లెక్సులు లేవు. అలాంటి ఇరుకు సందుల్లో ఇంటికో బడ్డీ కొట్టులస్సలు లేవు. ఏమయినా ఇప్పుడు వ్యాపారాలే బాగున్నాయి. ఇది మనిషికో ఊరికో జిల్లాకో రాష్ట్రానికో వచ్చిన మార్పు కాదు. దేశ దేశాల్లో వచ్చిన మార్పు. అందుకే మన దేశంలో బెస్ట్ మోడల్ ఎవరంటే మన సీ.ఎమ్.గారే! మన దేశంలో బిజినెస్ చేసుకొమ్మని ఢంకా వేస్తున్నారు. అంతా ఫూచర్...’ మధుగాడు మరాగడని తెలుసు.

“ఎవరి ఫ్యూచర్ ... ఎవరికి ఫ్యూచర్?” అన్నాను.

ఇంతలో మధుకి తెలిసిన వ్యక్తి ఎవరో విష్ చేస్తూ మా దగ్గరికి వచ్చాడు. ‘ఏం చేస్తున్నావ్?’ నుండి ‘ఫ్యూచర్ ఏమిటి?’ అన్నంత వరకూ ఇద్దరూ వెళ్ళి పోయారు. నేనలానే నిలబడ్డాను.

రెండ్రోజులుగా అంటే ఈ మధుగాడొచ్చిన దగ్గర్నుంచి నాకూ ఫ్యూచర్‌ని గురించిన బెంగ పట్టకోవడమే కాదు, మరింత ఎక్కువయింది. ఫ్యూచర్‌ని గురించి ఆలోచించకపోతే ఫ్యూచరే వుండదంటాడు వాడు. ఇప్పుడు కూడా వాళ్ళిద్దరూ ఫ్యూచర్ టెన్స్‌లో కంటే టెన్షన్‌లో పడ్డంతో నేనూ ఆకర్షింపబడిపోయాను.

“... ఈకాలం ఉద్యోగాలు రావు. వచ్చినా జీతమెంత? ఈ రెండు మూడు వేలతోటి ఈడ్చలేం. అయినా దానికి లంచాలెంత? ఆ నలభయ్యో యాభయ్యో వేలు పెట్టి వ్యాపారం చేసుకుంటే సరి. గవర్నమెంటు ఫ్యూచర్‌ని ఎలక్షన్లని దృష్టిలో పెట్టుకొనే ఈ పోస్టులు ఇంతదాక తియ్యక ఇప్పుడు తీస్తోంది. తీసిన వాటితో మంత్రులూ అధికార్లు ఖజానా నింపుకుంటారు, పార్టీ ఫండులిస్తారు.... మరి నీ చిట్‌ఫండ్ కంపెనీ....’

“ఎత్తేసి పారిపోతేనో...?”

“వందమంది బతుకులు వల్లకాడయి పోయినా నీకు ఫ్యూచర్ వుంటుంది” నవ్వుతూ అన్నాడు మధు.

“దాన్ని మా తమ్ముడు కొదిలేసి, రియల్ ఎస్టేట్సులోకి దిగాను. పెట్టుబడి ఇంకా వుంటే మరింత బాగుణ్ను....”

“బంజరు భూమంతా బంగారం పండే ప్లాట్స్ అంటావ్...., సరే మాకు బస్సు తప్పిపోతుంది. మళ్ళీ కలుద్దాం” మధుగాడు వదిలేసాడు. ఫ్యూచర్ని వద ల్లేదు. నడుస్తున్నా అవే మాట్లాడుతున్నాడు. బస్సులో కూర్చున్నా అవే మాట్లాడుతున్నాడు.

“... ఎక్కడ విశాఖపట్నం? ఎక్కడ కొత్తవలస? ఇదేమో విజయనగరం జిల్లా. అయినా సరే దూరాన్ని ఫ్యూచర్‌తో కొలిచే వాళ్ళున్నారు కాబట్టే ఏడెనిమిదేళ్ళ క్రితం పాతిక రూపాయలున్న చదరపు గజం భూమి ఖరీదు పక్కన ఓ సున్నా చేరింది” అంటూనే తన తండ్రికా భవిష్యత్తు దృష్టి లేనందుకు మధుగాడు తిట్టుకున్నాడు.

ఇల్లు చేరుకున్నాం. ఓన్ హౌస్ అని చెప్పాడు. ఏ హైస్కూల్ తరువాతో... చదువుల పేర విడిపోయిన వాళ్ళం, అందుకనే ఇంటందర్నీ గుర్తు చేసాడు, అదే పరిచయం. తరువాత ఇంటిలోని గదులన్నీ చూపించాడు. సొంత ఆస్తిగా కనీసం ఇల్లయినా వుండాలన్నాడు. అది స్టేటస్‌కు సింబలన్నాడు. ఏమీ లేకపోయినా ఇల్లు వున్నందుకు ఫ్యూచర్‌లో అప్పన్నా పుడుతుందన్నాడు.

ఇంతలో టీతో వచ్చింది పరికిణీ చుట్టుకున్న అమ్మాయి.

టీ అందుకుంటూ మీ.. అన్నాను. 'చెల్లాయి చిన్నది' పూర్తి చేసాడు. టీలు తాగినా టాపిక్ పూర్తికాలేదు. మధు చెప్పడం మొదలు పెట్టాడు.

"పెద్దది వనజ.... వనజాక్షి తెలుసుగా.... అన్నట్టు నీవు పెళ్ళికి కూడా వచ్చావుగదా? దాన్ని రైతుకిచ్చేసాం. ఏం ఉద్యోగాలు? ఉంటాయో ఊడుతాయో తెలీదు. గోల్డెన్ షేక్‌హేండ్ వచ్చి ఫ్యూచర్ గేరంటీ లేదు. న్యూ ఎకనమిక్ పాలసీ! ప్రైవేటైజేషన్! జాతీయం చేసిన బేంకులు యల్ఐసీలు మళ్ళీ ప్రవేటుపరం చేసే ప్రయత్నం... మల్హోత్రా కమిటి చూసేవుగా? చొక్కానలగని ఉద్యోగాలకీ ఉక్కపోత తప్పేట్టు లేదు.... అందుకే చెల్లిని రైతుకిచ్చేసాం. బాధలేదు. బక్కా బడుగూ వుంది. బలిసిన రైతులే.... బావమర్దికదా అలా అంటాలే. వాళ్ళకీ ఒక్కడే కొడుకు. కంబార్లను పెట్టుకున్నా కాలం గడిచిపోతుంది. అయినా రేపోసారి అక్కడకు వెళ్దాం.... ఇక్కడకు దగ్గరే. పదిహేను కిలోమీటర్లు..." చెప్తూలేచి వెళ్ళాడు.

పెరటి గదిలోంచి పేకట్‌తో వచ్చాడు. 'చీమల మందు, బియ్యానికి పట్టకుండా' అంటూ మంచం కింద వున్న బస్తా చూట్టూ చల్లాడు. పని పూర్తి చేసి పక్కనే వచ్చి కూర్చున్నాడు. తన ధోరణిని కొనసాగించాడు.

"... ఈచెల్లిని కూడా రైతుకివ్వడం ఇష్టంలేదు. డిగ్రీ ఈ ఏడు పూర్తి చేస్తుంది. అటు ఉద్యోగస్తులు వస్తున్నా లక్షల రూపాయలు ఇద్దామన్నా పైరాబడి లేని ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగాలు...... అమ్మకి కూడా ఇంట్రెస్టు లేదు. బిజినెస్ మేనో, కంట్రాక్టరో అయితే ఫరవాలేదు........" మధు చెవుతుండగ వాళ్ళ అమ్మగారు వచ్చి చెప్పడం ప్రారంభించేరు.

"ఈ మధ్య మరొక సంబంధం వచ్చింది బాబూ, అబ్బాయి దుబాయిలో వున్నాడు. ఒక్కడే కొడుకు. ముసలాళ్ళిద్దరూ ఇక్కడే వైజాగ్‌లో వున్నారు. ఆ కుర్రాడు పదో ఇంటరో చదివినా టెక్నికల్ వర్క్ వచ్చును. మెకానిక్, నెలకు పన్నెండు వేలు జీతం. ఓ పదేళ్ళు కష్టపడి వచ్చేస్తాడు. అప్పుడప్పుడూ వచ్చి చూసిపోతాడట. రేపు ఆ డబ్బులన్నీ ఫిక్సుడు డిపాజిట్ చేసి ఎందులో వేసుకున్నా, వడ్డీ డబ్బులతోనే కాలం గడిచిపోతుంది... ఏమంటావ్?" అని నావేపు చూసింది.

ఏమంటాను? నేనేమి అనలేక అవునన్నట్టూ కాదన్నట్టూ రెండు విధాలా తలని అయోమయంగా ఊపేను.

"పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతాడట. ఇది అత్తారింట్లో... ఇక్కడా... పదేళ్ళూ... మరి ఆ అరబ్బు దేశం తీసుకెళ్ళడం కష్టమో? ఇష్టం లేదో తెలీదు" మధు అన్నాడు.

"సంవత్సరానికి నెలా పదీ సెలవులుండవా? దాని కడుపున కాయో పండో కాస్తే ఇంక లోటేమిటి? తల్లీ బిడ్డా వుండరా బాబూ, ఎలాగ వాళ్ళ నాన్న సంపాదిస్తున్నాడు కాబట్టి ఏ ఇంగ్లీషు

కాన్వెంటులోనో పడెయ్యెచ్చు. డబ్బులు ఖర్చయినా రేపటి గురించి బెంగుండదు" తల్లి మాటతో మధు ఇంకేమి మాట్లాడలేదు.

నాకు ఏ విషయాలు అంత తొందరగా జీర్ణమయ్యేలా లేవు.

తరువాత వాళ్ళేవో పనుల్లో పడితే, నే భరించలేని ఆలోచనలతో టేబుల్ మీది మేగ్‌జైన్ అందుకొని అందులో తల దూర్చాను.

'ఫ్యూచర్!'

కళ్ళు పులుముకు చూసాను. ఏదో 'ఫీచర్' అని వుంది. నా కళ్ళకది 'ఫ్యూచర్'లా అగుపించింది. నన్ను నేను తిట్టుకున్నాను. పేజీలు తిరగేసాను.

'వేసవి సెలవుల్లో రెండునెలలు కంప్యూటర్ కోర్సు!

295/- కడితే చాలు కంప్యూటర్ యుగంలో కమ్మని ఉద్యోగం'- ఫ్యూచర్!

వేసవి కాలం అంటే - "ఎండాకాలం చదువు!"

మరో పేజీ తిప్పాను.

'మీ పిల్లల బంగారు భవిష్యత్తుకి, మీ పిల్లల్ని డాక్టరో... ఇంజనీరో.... చదివించడానికి జిగ్‌జాగ్ రెసిడెన్షియల్ కాలేజీ'- ఫ్యూచర్!

కోపంతో మరో పేజీ తిప్పాను. ఇంకో పేజీ... ఇంకోపేజీ.... అంతా- 'జీవన్ సుకన్య!

రేపటి మీ అమ్మాయి కలలు పండించే అల్లుడి కోసం!'- ఫ్యూచర్!

సి.జి.జి.ఎఫ్.

చిల్డ్రన్స్ కాలేజీ అండ్ కేరీర్ ఫండ్, రేపటి డొనేషన్ల కోసం- ఫ్యూచర్!

'యు.టి.ఐ. రాజ్యలక్ష్మి!

మళ్ళీ మీ అందరి కోరిక మేరకు ఇష్యూ ఓపెన్!

ఇరవై సంవత్సరాల్లో ఇరవై ఒక్క రెట్లు.... ఇంకా బోనస్

మీ అమ్మాయి పెళ్ళికి చింతలేదు- ఫ్యూచర్!'

అప్పటికి కట్నం రేటు పెరిగిపోదూ? పెరుగుతుందో తరుగుతుందో ఈ లోపు చస్తామో బతుకుతామో?! ఏమౌతామో... ఆలోచనల నుండి బయటపడాలని గబగబా మరో నాలుగు పేజీలు తిప్పి అలవాటుగా (?) అడ్వర్‌టైజ్‌మెంటు దగ్గరే ఆగిపోయాను.

'కామసూత్ర... కే. యస్. కావాలని అడగండి!

నిరోధ్... మీ భవిష్యత్తుని మీరే నిర్ణయించుకొన్నప్పుడు,

మీకు కావాలి రబ్బరు తొడుగు- ఫ్యూచర్?'

ఒళ్ళంతా జలదరించి గబుక్కున పుస్తకం మూసేశాను. కళ్ళు గట్టిగా మూసుకున్నాను. అలాగే కుర్చీలో వెనక్కి చేరగిలబడిపోయాను.

''నిద్రొస్తోందా? తిన్నాక పడుకుందువు...లే(....'' మధు లేపేశాడు. కారణాలు వాడికి కనిపించనట్టే వున్నాయి. అందుకే పక్కనే కూర్చుంటూ తెచ్చిన న్యూస్ పేపరు విప్పాడు. వాడికి హెడ్‌లైన్స్ కంటే ముందు ఏదో పేజీలో చీమతలకాయల్లా వున్న 'షేర్ మార్కెట్' కనిపించింది.సిరుల పంటని చెప్పి పత్రికలూ పేజీలు కేటాయించాయి. షేర్ల మీద పేపర్లూ పత్రికలూ ప్రత్యేకంగా వస్తున్నప్పుడు పేజీలు కేటాయించడం వింతకాదు. గ్రహ ఫలితాల్లాగే.... లాటరీ ఫలితాల్లాగే... ఫ్యూచర్ ఫలితాలు!

''మాస్టర్ గ్రోత్ నా పేర్న, మాస్టర్‌గెయిన్ మాఅమ్మ పేర్న....'' మధు చెప్పుకుపోతున్నాడు. నే ఫాలో కాలేక రిప్లై ఇవ్వకపోవడంతో ''ఈ బిజినెస్‌ని మించిన బిజినెస్ లేదనుకో, నాకయితే బొంబాయి పోవాలనిపిస్తుంది. ఏమయినా హర్షత్ మెహతా గ్రేట్ మెన్.... ఎన్నాళ్ళు కష్టపడితే ఎంతమందిమి కష్టపడితే ఆర్జిస్తాం? అయినా హర్షత్ ఇప్పుడయినా షేర్స్ కాలమ్ నడిపినా, ట్యూషన్ సెంటరు పెట్టినా బాగా లాగుతుంది'' మధు నవ్వుతూ అంటున్నాడు. వాడి జోక్‌కు నవ్వాలనిపించలేదు.

ఇంతలో వాళ్ళ అమ్మగారు భోజనాలకు పిలిచారు. మధు మరో గంట దాక షేర్లలో కిందా మీదా పడి ఒక అంచనాకు వచ్చేకే లేచాడు. ఈ నెల బాలేదన్నాడు. గతంలో పదీ రూపాయలు యూనిట్ అరవై నాలుగుకి వెళ్ళినపుడే అమ్మేయవలసిందని వాళ్ళమ్మగారు ఎంతో నొచ్చుకున్నారు. లేకపోతే తన మెడలోని పుస్తెలతాడు దగ్గర్నుంచి, అయిదు రూపాయల వడ్డీకి (వందకి, నెలకి) తెచ్చిన పదివేరూపాయల దాక బెంగ పట్టుకొని రాత్రీ పగలూ నిద్రపట్టడం లేదన్నారు. అంతకు ముందు అనారోగ్యం లేదన్నారు.

అప్పుడే వాళ్ళ నాన్నగారు వచ్చారు. కుశలం అడిగారు. 'చాన్నాళ్ళయిందిలే నిన్ను చూసి. మీ అన్నయ్యకి ఉద్యోగం వచ్చిందా? తమ్ముళ్ళిద్దరూ ఏం చేస్తున్నారు? పోన్లే మీకు ఆడపిల్లలు లేరు. రాబడే గాని పోవడం వుండదు. కొడుకుల్ని కాసినోళ్ళ కొంగు బంగారమని శాస్త్రం వుత్తినే పోలేదు. అందులో మీలో కట్నాలు బాగానే వుంటాయి...'' అంటూ ఆయన మేం తింటున్న దగ్గరే కూర్చుండి పోయారు.

భవిష్యత్తు అంచనా కోసం నేను నా గతాన్ని వాళ్ళ ముందు అవిష్కరించక తప్పలేదు. ఆవిడ కూడా ఆసక్తిగా వుండి, ఆగితే ఆగనిచ్చేట్టు లేదు. చెప్పాను.

'రెండు పీజీలూ ఒక లైబ్రరీ సైన్సు కోర్సు చేసి, ఎనభై తొమ్మిదిలో పబ్లిక్ సర్వీసు కమీషన్, గ్రూప్‌ఫోర్ సెలక్టయి ఇంతదాక ఏదీలేదు. అన్నయ్య అలా ఎదురు చూస్తూనే వున్నాడు. పెళ్ళి! పెళ్ళంటే పిల్లలూ! నేనిలా తెలుసుగా.... నా తరువాత వాడు 'ఎమ్‌సెట్' కోచింగ్ షార్ట్ టెర్మ్ ఆరువేలు కట్టాం, రాక లాంగ్ టెర్మ్ నెల్లూరు నుండి గుంటూరుకు మార్చి, పాతికవేలు జూదం! ఇప్పుడు అటూ ఇటూ కాని రాంక్! ఆఖరి తమ్ముడు ఇంకా టెన్త్!' నే పూర్తికానిచ్చానో లేదో....

'ఈ కాలం చదువులు వేస్టోయ్.... ఏ షెడ్‌లోనో బడ్డీలోనో పెట్టెయ్యాలి. లేకపోతే ఫ్యూచర్ వుండదు' తేల్చేసాడాయన.

నాకు తిన్నది అక్కడే అరిగిపోయింది.

మబ్బు వేయడంతో చల్లగాలికి మేడ ఎక్కాం. ఇరుగూ పొరుగూ కుర్రాళ్ళు వచ్చేరు. ఏయే యాక్టర్స్‌కు ఫ్యూచర్ వుందో ఎవరి ఎనాలసిస్‌తో వారు నిర్ణయిచేరు. చివరకు తెలిందేమిటంటే హీరోయిన్లకి ఫ్యూచర్ తక్కువని, హీరోలకి ఎక్కువని! ఎందుకంటే నాలుగు పాటలకి నలుగురు హీరోయిన్లు వున్నా ఆ సినిమాకు ఫ్యూచర్ వుంటుంది. అదే ఒక హీరోయిన్‌కి నలుగురు హీరోల్ని పెడితే...? 'అపవిత్రత' వల్వ ఫ్యూచర్ ఇల్లే!....

తరువాత టాపిక్ సినిమాల మీది నుండి రాజకీయాల మీదికి? బియ్యేస్పీ పార్టీ 'దళితులో' అంటూ దండుకోజూస్తోంది. కాబట్టి, కాంగ్రెసు ఉపముఖ్యమంత్రి పాచిక! కోనేరయినా సెలయేరయినా ప్రజలకి నీళ్ళందొద్దూ?....

ఆ పైన ఆగలేదు దేశసరిహద్దులు దాటి....

చైనా భారత్ సత్సంబంధాల కోసం సంతకాలు చేసినా ఫ్యూచర్ మీద బెంగే, అందుకే మిలటరీని మేపడం!....

ఫ్యూచర్ కాలిపోతున్న కొద్దీ తమఫ్యూచర్‌ని వదిలేసి దేశాల ఫ్యూచర్ని పట్టుకున్నారంతా, నేనూ పట్టుకున్నాను నా తలకాయ!

ఆ రాత్రి గడిచింది, తెల్లవారే మధు బలవంతం చేస్తే వనజాక్షి వాళ్ళ ఊరు వెళ్ళక తప్పింది కాదు, వాళ్ళ బావగారితో పాటు అందరూ బాగానే రిసీవ్ చేసుకున్నారు. 'ఏం చేస్తున్నారు?' నుంచి 'ఏం చేయాలనుకుంటున్నారు?' ఫ్యూచర్ మళ్ళీ...మళ్ళీ....

వనజాక్షి ఇంటర్ చదువుతున్నప్పుడులా వెలుగు నిండిన కళ్ళతో లేదు. బాగా నల్లబడింది నాకంటే అయిదేళ్ళు చిన్నదయినా పదేళ్ళు పెద్దలా వుంది. పలుకరించింది. పనిలో పడిపోయింది.

"పెద్ద కుటుంబం-రైతు కుటుంబం, వంట తప్ప వేరే పని వుండదు" మధుగాడు చెల్లెలి ఫ్యూచర్‌కు పొంగిపోయాడు.

తరువాత వాళ్ళ బావగారితో పొలాల్లోకి వెళ్ళాం.

పొలాలన్నీ రొయ్యల చెఱువులు!

చేపల చెఱువులు!

గొయ్యిలు.... మనుషుల్ని నిలుపునా కప్పెట్టేంత విశాలమైన చెఱువులు!

'ఈమట్టి నేల కంటే సముద్రపొడ్డు చౌడు నేలలయితే ఎంతో బాగున్ను. ధర పలుకును. రొయ్యల పెంపకానికి బాగున్ను. ఈ మట్టిలో మామూలు చేపే!.... మా తోటన్న చెప్పాడు. ఇప్పుడు ఆళ్లేరియాలో ఉప్పు దిగుబడే లేదట. అంతా రొయ్యే....రొయ్య పంటే... చెఱువులే.... మంచి

ఫ్యూచరుంటాది" బావగారు బాధపడుతున్నట్టే వున్నారు. బావగారి కోసమై సముద్రాన్ని ఇటుపక్కకు తిప్పలేని మళ్ళించలేని అభాగ్యుడిలా మధుగాడు కూడా నిల్చున్నాడు.

శారదా నది ఒడ్డుకి వెళ్ళాం. నదిలో నీరు లేదు. ఒడ్డున పంట వుంది. వరికాదు వంగడం కాదు. సరుగుడు చెట్లు! తోట! కాదు అడవి! అయిదేళ్ళు ఆగితే నువ్వా నేనా అన్న పంటట....

అప్పటికి మధ్యాహ్నం కావడంతో తిళ్ళకోసం ఇల్లు చేరాం.

నిద్ర లేచిన వనజాక్షి కొడుకు వచ్చీరాని నడకతో వచ్చి, వాళ్ళ నాన్నని, మామయ్యని చుట్టేశాడు. అంతలోనే వెళ్ళి 'కిడ్డీ బాంకు' బొమ్మ తీసుకువచ్చి డబ్బులు వేయమన్నాడు. మధుగాడు మెచ్చుకుంటూ వుంటే నేనూ.... వాడి 'ఫ్యూచర్'కి అబ్బురపడిపోయాను.

వనజాక్షిఅత్త టీవి పెట్టింది.

ఏదో కార్యక్రమం పూర్తయింది.

ఈ కార్యక్రమ మేమిటి? ఏ కార్యక్రమమయినా పొదుపు కోసం అదుపు లేకుండా అందిస్తూ అరుస్తూ కమీషనర్, చిన్న మొత్తాల పొదుపు సంస్థ.... రికరింగ్ డిపాజిట్.... బోనస్.... పస్సురాయితీ.... దగ్గరిలో వున్న పోస్టాఫీసు....

ఫ్యూచర్!.... ఫ్యూచర్!! ఫ్యూచర్!!!....

తిన్న అరగంటకే 'టీ'లు తాగి పెద బావగారొస్తే అంతా కలసి మిల్లుకి వెళ్ళాం. ధాన్యం పప్పులూ ఆడుతూ వున్నారు. మేమెళ్ళాక కరెంటుపోయింది. రైతులూ కూలోళ్ళూ అందరూ వచ్చి కూర్చున్నారు. అవీ ఇవీ కదిలాయి!

ఎరువులు.... విత్తనాలు.... సబ్సిడీలు.... ఋణాలు

'బెల్లం మీద నిషేధమా?....'

'గయిర్నమెంటు మిల్లుల కోసమయితే.... పంచదార కోసమయితే.... చెఱుకు పండించొచ్చునా? ఆలిష్టమేనేటోస్?....'

"మన పొలం మనం దున్నాకోడదా?!..... మన ఇత్తనం మనం ఎయ్యాకూడదా.... ఇదేమి సిత్రం?"

"గాట్ ఒప్పందం వస్తోంది, అలాగే వుంటుంది ముందు ముందు.... ఫ్యూచర్‌లో...." మధుగాడు మధ్యలో కలిసిపోయాడు.

అది విని అక్కడివాళ్ళు ఆశ్చర్యపోలేదు. ఆఁ....' అని నోళ్ళు వెళ్ళబెట్టలేదు. మామూలు విషయం మాటాడినట్టే మాటాడారు. కాపోతే గొంతులో స్వరం పెద్దదైంది.

"మాం విన్నాం.... ఏంగాటో....పోటో.... గాడ్డి కొడుకులు అలాటివేల ఒప్పుకున్నారు? ఓట్లుకి రారా అడగమా?"

“అడిగితే .... సంతల సింతపండు సీనేటి సేద్దును, సంతకాలు ఎట్టేన్ను లచ్చికి గాజుల్లేవు అనీరా....”

“అడేదెయ్యమంటే రేపు అదే మనమేసి పండించాలట, ఇత్తనాలు అడేస్తాడు. పంటా ఆడే కొంతాడు. ఇదంతా మనకప్పు ఇచ్చినోడి లంపాట్కమూ.. అమెరికావోడి పితలాటకమున్నా....”

“జెస్ట్ ఫ్యూచర్‌లో.... పదేళ్ళలో ఇదంతా వస్తుంది” మధు మళ్ళీ కలసిపోయి అన్నాడు.

“మనలాంటోళ్ళకి దెబ్బంటావా?” బావగారెందుకో బెంగపడినట్టున్నారు.

“అవును బావూ యేపకొమ్మ ఇరపకూడదట. ఎవుడో కొనుక్కున్నాడట గదా? ఎక్కడి ‘హామిరికా’ వోడో ఇక్కడి మాసెట్లు మా సిత్తం లేకుండా కొనడమేటి?”

“ఓరి దద్దా పందుం పుల్లకి ఇరిపినా పోలీసులు అరెస్టు చేస్తారట్రా. కొన్న నా కొడుకే అక్కుదారట, వూరుకుంతాడా?”

“అమ్మందే కొండమేటేస్....? ఈకలాగ....”

“పోలీసుల్ని కాపోతే మిలట్రీని దింపమను, సూసుకుందుము తడాఖా? ఒక్క అమ్మా అయ్యికే పుడితే రమ్మను....”

ఒకడు పంచె బిగించాడు. మరోడు నడుంకి తువ్వాలు కట్టేడు. ఇంకోడు పిడికిట్లో కర్రని బిగించి పట్టాడు.

“సెక్కా ముక్కా వున్నోలం... మనలాటి సిన్న సన్నకారుల మీద కెవడొస్తాడు? వస్తే పెద్ద రైతుల మీద పడాల. ఆలకి పంట యేపారం. యవసాయం యేపారం! మనకో కూలిగింజలే కూడుగింజలు. పంట గింటలే తిండి గింజలు. అదవా మనమీదకొచ్చినా నాలుగు గట్లుకి నలుగురం వున్నాం. ఎన్ని జంతువులుకి కాపు కాయలేదు. కొడవలికి కక్కులు పట్టించండ్రా. కొంటె గర్రల్నీ దబ్బలాల్నీ తియ్యండి. జనపనార తాళ్ళు పేనండి. బొరిగిలకి, పారలకి పదును పట్టండి....”

ముసలోడి మట! అక్కడ అందరికీ అదే బాట!

ఆ రాత్రికి తిరుగు ప్రయాణంలో బస్సులో.... వాళ్ళ బావగార్లాగే మధుకూడా దేనికో భయపడుతున్నాడు. బహుశా అది ‘ఫ్యూచర్’ గురించే కావచ్చు!

నా కిప్పుడు భయం లేదు! ఎందుకంటే ఫ్యూచర్‌కి ఇప్పుడు ఎంతో ఫ్యూచర్ వుంది!!

★ ★ ★

ప్రచురణ : ‘అరుణతార’ జనవరి 1995,

**రచనా కాలం :** 19 ఆగష్టు 1994